క్లుప్తంగా

ఓటరు జాబితా సవరణపై దృష్టి సారించండి



సర్వేను పరిశీలిస్తున్న ఎన్నికల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు

పెద్దవడుగూరు : ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్నికల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం లక్ష్మంపల్లి, చిన్నవడుగూరు, దిమ్మగుడి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలతో ఓటరు జాబితా సర్వేపై ఆరా తీశారు. ఓటరు జాబితా లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. ఎవరైనా మరణించినట్లు తెలిస్తే వారి ఆధారాలు సేకరించి ఓటర్ జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఇంటిని నంబర్‌ను మార్చడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ నాగభూషణ, వీఎల్ ఓలు ఉన్నారు.

గుత్తిలో మౌన ప్రదర్శన



బైబిల్ మిషన్ చర్చిలో మౌన ప్రదర్శన చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలో బైబిల్ మిషన్ చర్చిలో శనివారం చర్చి పాస్టర్ రెవరెండ్ అద్భుత కుమార్, మణికుమారి ఆధ్వర్యంలో మణిపూర్‌లో జరుగుతున్న అకృత్యాలపై మౌన ప్రదర్శన(నిరసన) చేపట్టారు. వందలాది మంది సుమారు అరగంట పాటు మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అద్భుత్‌కుమార్, మణికుమారి దంపతులు మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు జరగకుండా ఉండాలని ప్రార్థించారు.

మల్లయ్యకొండలో జడ్జి దంపతుల పూజలు

తంబళ్లపల్లె: అనంతపురం జిల్లా తాడిపత్రి జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయమూర్తి చంద్రశేఖర్‌రెడ్డి, సతీమణి చంద్రకళ వారి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మల్లయ్యకొండను సందర్శించారు. ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, కొండకిట్టా, పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు న్యాయమూర్తి దంపతులకు స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గౌరమ్మగట్టులోని గౌరమ్మతల్లికి ప్రత్యేక అభిషేకాలు, పూజలతో న్యాయమూర్తి దంపతులు మొక్కులు తీర్చుకున్నారు.

చీనీ రైతును ప్రభుత్వం ఆదుకోవాలి



చీనీ తోటను పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

గార్లదిన్నె: చీనీ పంట నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కొట్టాలపల్లిలో విద్యుత్ ప్రమాదంలో కాలిపోయిన చీనీ చెట్లను ఏపీ రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ అధికారుల తప్పిదం వల్లే రైతు ఆదిశేషయ్య కు అపార నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే రైతును ఆర్థికంగా ఆదుకోవా లన్నారు. శింగనమల నియోజక వర్గ కార్యదర్శి నారాయణ స్వామి, కార్యదర్శి రాము, షర్మష్ వలి, వన్నూర్‌వలి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మోదీ సర్కారును గద్దెదింపేందుకు ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రసాద్

గుంతకల్లుటౌన్: దేశంలో ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ సర్కారును గద్దెదింపేందుకు కార్మికులంతా ఉద్యమబాట పట్టాలని జాతీయ కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గాయత్రీ ఫంక్షన్‌హాల్‌లో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర వర్క్‌షాప్, రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఐఎఫ్‌టీయూ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోదీషాల నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అవలంబిస్తూ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతోందన్నారు. యూనిఫామ్ సివిల్ కోడ్, మణిపూర్ ఘటనలే ఇందుకు ఉదాహరణలన్నారు. కార్మిక వర్గంపై లేబర్ కోడ్స్ పేరుతో జరగబోతున్న దాడిని తిప్పికొట్టేందుకు కార్మికలోకం నడుం బిగించాలన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.పోలారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, హరికృష్ణ, జిల్లా అధ్యక్షుడు బి.సురేష్, డివిజన్ కార్యదర్శి జి.చిన్నా, రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పరవశించిన భక్తజనం



అగ్నిగుండాన్ని వెలిగిస్తున్న భక్తులు

కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలతో గూగూడు భక్తితో పరవశించింది. కుళ్లాయిస్వామిని కనులారా వీక్షించిన భక్తజనం తన్మయత్వంలో మునిగిపోయారు. శనివారం తెల్లవారుజామున పీర్ల గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఉదయం స్వామి అగ్నిగుండ ప్రవేశ సమయంలో కుళ్లాయిస్వామి నామస్మరణ మార్మోగింది. సాయంత్రం జలధి కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలిరావడంతో గూగూడు వీధులు జనసంద్రంగా మారాయి. – నార్పల



స్వామి గొడుగుతో అగ్నిగుండంలో ప్రవేశిస్తున్న భక్తుడు





కొబ్బరి దివిటీలతో కుళ్లాయిస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం, తప్పెట కళాకారుల ప్రదర్శన



పీర్లకు మొక్కుతున్న భక్తులు



పీర్ల ఊరేగింపును సెల్‌ఫోన్లలో బంధిస్తున్న యువకులు



స్వామి మొక్కు చెల్లించేందుకు కోడితో భక్తుడు



అగ్ని గుండం ప్రవేశానికి సిద్ధం చేస్తున్న దృశ్యం

రాయితీతో పశువుల దాణా

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో పశువుల దాణా సరఫరా చేస్తోందని పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బీకేఎస్, నార్పల మండలాలకు 25 టన్నుల సంపూర్ణ దాణా వచ్చిందని పేర్కొన్నారు. దాణా టన్ను పూర్తి ధర 15,800 ఉండగా రాయితీతో 9,300 అందిస్తామని తెలిపారు. రైతులు దాణా కోసం బీకేఎస్ ప్రాంతీయ పశు వైద్యశాల, కొర్రపాడు, నార్పల, బి. పప్పూరు, వైద్యశాలల్లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఏడు శనివారాల వ్రతం

తాడిపత్రి అర్బన్: లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న ఏడు శనివారాల వ్రతాన్ని ఏడో వారం పట్టణంలోని చింతల వెంకటరమణ స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీబట్టార్ నేతృత్వంలో మహిళలు సామూహిక వ్రతమాచరించారు. ఈసందర్భంగా ఆలయంలోని ప్రధాన ఆది దేవతలైన లక్ష్మీసహిత చింతల వెంకటరమణస్వామికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వత్రంలో పాల్గొన్న మహిళలకు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బాణా నాగేశ్వర్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



ఏడు శనివారాల వ్రతంలో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో మొహర్రం



అక్కన్నపల్లిలో పీర్లను దర్శించుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి



యాడికి : చందనలో పీర్ల ఊరేగింపును తిలకిస్తున్న డీఎస్పీ సీఎం గంగయ్య



పెద్దవడుగూరులో జలధికి వెళ్తున్న పీర్ల స్వాములు



గుత్తి: బారే హిమామ్ పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంతో పాటు చందన, రాయలచెరువు, పెద్దపేట, వేములపాడు, కమలపాడు, కోనుప్పలపాడు, లక్షుంపల్లి, దైవాల మడుగు, రామరాజుపల్లె, తూట్రాళ్లపల్లె తదితర గ్రామాల్లో మొహర్రంను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శనివారం తెల్లవారుజామున పీర్లను ఆయా గ్రామాల్లో మేళ తాళాలు, తప్పెట్లతో గ్రామోత్సవం నిర్వహించారు. పీర్లకు చక్కెర, బెల్లం, కొబ్బెర, చది వించి గంధం చల్లుతూ మొక్కులు తీర్చుకున్నారు. చందన గ్రామంలో తెల్లవారుజామున 2 గంటలకే పెద్దపీరు స్వామితో పాటు మరో 10 స్వాములకు గ్రామోత్సవం నిర్వహించారు. యువకులు విచిత్ర వేషధారణలతో అలరించారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు. చందనలో పీర్ల జలధి కార్యక్రమాన్ని డీఎస్పీ సీఎం గంగయ్య, సీఐ శంకర్ రెడ్డి తిలకించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

తాడిపత్రి అర్బన్: అక్కన్నపల్లి గ్రామంలో శనివారం జరిగిన మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు కేతిరెడ్డి హర్షవర్ధరెడ్డి స్వాగతం పలికారు. పీర్ల చావిడి వద్దకు వెళ్లి అక్కడ పీర్లను దర్శించుకుని చక్కెర చదివించారు.

పెద్దవడుగూరు : మండలవ్యాప్తంగా మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్దవడుగూరు, బుర్నాకుంట, తదితర గ్రామాల్లో సాయంత్రం పీర్లస్వాములు అగ్ని గుండ ప్రవేశం చేశాయి. అనంతరం జలధికి తరలివెళ్లాయి. భక్తులు పెద్ద ఎత్తున పీర్ల చావిడి వద్దకు చేరుకొని చక్కెర చదివింపులు చేశారు. ముప్పాలగుత్తి, బుర్నాకుంట గ్రామాల్లో జరుగుతున్న మొహర్రం వేడుకలను డీఎస్పీ సీఎం గంగయ్య తిలకించారు. యాడికి సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలో శనివారం మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామున నాలుగు గంటలకు బారే హిమామ్, పగ్గాల, బొడ్డు పీర్లను ఊరేగించారు. ఊరేగింపును తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. లచ్చానపల్లి, కొజ్జేపల్లి పీర్లను కూడా గుత్తిలో బారే హిమామ్, పగ్గాల, బొడ్డు పీర్లతో కలిసి ఊరేగించారు. తప్పట్లు కొడుతూ యువకులతో పాటు పెద్దలు సైతం చిందులు వేశారు. అగ్ని గుండ ప్రవేశాలు జరిగాయి. సాయంత్రం పీర్లు జలధికి వెళ్లాయి. పట్టణంలోని అతి పవిత్రమైన బారే హి మామ్ పీర్లను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ యువనేత మంజునాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ పీరా, జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్‌యాదవ్, పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు దర్శించుకుని చక్కెర చదివించారు. బేతాపల్లి, గొంది పల్లి, బసినేపల్లి, యంగన్నపల్లి , రజాపురం, ఎర్రగుడి, బ్రాహ్మణ పల్లి, అబ్బేదొడ్డి, ఇసురాళ్ల పల్లి, జక్కల చెరువు, తొండపాడు, కొత్తపేట, కొత్తపల్లి , మాముడూరు, పెద్దొడ్డి, బసినేపల్లి తాండా, అనగాన దొడ్డి, బాచుపల్లి, కరిడి కొండ, ధర్మాపురం, వన్నేదొడ్డి తదితర గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలు ముగిశాయి.

వైభవంగా పెద్ద సరిగెత్తు వేడుకలు

పుట్లూరు: మండలంలో శనివారం మోహరం వేడుకల్లో భాగంగా పెద్ద సరిగెత్తు వేడుకలు వైభవంగా కొనసాగాయి. మండలంలోని శనగలగూడూరు, కడవకల్లు, సూరేపల్లి, చెర్లోపల్లి, మడ్డపల్లి, ఎల్లుట్ల తదితర గ్రామాల్లో పీర్లను ఊరేగింపు నిర్వహించారు. ఎల్లుట్ల గ్రామంలో జలధి కార్యక్రమం నిర్వహించారు.

ఎర్రబీళ్లలో పీర్ల సందడి

యల్లనూరు: చింతకాయమంద–గొడ్డుమర్రి–శింగవరం గ్రామాల సరిహద్దుల్లో ఎర్రబీళ్లలో పీర్లు సలాం అందుకున్నాయి. ఏటా ఐదు గ్రామాల పీర్లు సలాం అందుకుని చెక్కరను చదివింపులు అయ్యాక ఆయా గ్రామాల పీర్లు చావిళ్లకు పోవడం ఇక్కడ ఆనవాయితీ. చింతకాయమంద, శింగవరం, గొడ్డుమర్రి, కల్లూరు, తిమ్మంపల్లి గ్రామాల పీర్లు ఎర్రబీళ్లలో సందడి చేస్తాయి. వివిధ రకాల వేషధారణలతో వ్యక్తులు సందడి చేశారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని పీర్లు సాయంత్రం జలధికి వెళ్లి తిరిగి పీర్లను శుభ్రం చేసి ముస్లింలు పీర్ల చావిడిలో ఏర్పాటు చేసిన పెట్టెలో భద్రపర్చుతారు. యల్లనూరు చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో సాయంత్రం ఐకమత్యంతో గ్రామాల ప్రజలు కలిసి సందడి చేశారు. పీర్లపండుగ సందర్భంగా పిల్లలు, పెద్దలు సంతోషంగా గడిపారు. ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

పామిడి: పట్టణంలో శనివారం మొహర్రం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా 10వ ఖాన్‌ను పురస్కరించుకొని పీర్లస్వాములు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. భక్తులతో పీర్లమకాన్లు కిటకిటలాడాయి. సాయంత్రం పీర్లస్వాముల సవారీ నిర్వహించారు. దారిపొడవునా భక్తాదులు పీర్లస్వాములను దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. రాత్రికి పీర్లస్వాములను జలధికి తరలించారు.

గార్లదిన్నె: మండల కేంద్రం, యర్రగుంట్ల, మర్తాడుతో పాటు పలు గ్రామాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకల్లో భాగంగా పెద్ద సరిగెత్తు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో భక్తులు పీర్ల స్వాములను దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సరిగెత్తులో భాగంగా భక్తులు పానకాలు తెచ్చి పీర్ల చావిడిలో చదివించారు.

శింగనమల: శింగనమలలో మొహర్రం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం వెండి పీర్లు, మూడు నాలుక పీర్లు, అక్బర్ చావిడి పీర్లు, గొలకొండరాయుడి పీర్లు, అసరా కట్ట పీర్లు, దడెం చావిడి పీర్లు, కొడి పీర్లు, ఆచారి పీర్లు, గండ్లగండ్ల చావిడి పీర్లను మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఊరేగించారు. చెరువు వద్దకు తీసుకెళ్లి జలధి చేపట్టారు. గోవిందరాయునిపేట, చిన్నజలాలపురం, గురుగుంట్లలో మొహర్రం వేడుకలు ముగిశాయి.



గుత్తి: బారే హిమామ్ పీర్లను దర్శించుకుంటున్న మంజునాథ్‌రెడ్డి



పుట్లూరు: ఎల్లుట్లలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



యల్లనూరు: ఎర్రబీళ్లల్లో సలాం అందుకుంటున్న పీర్లు



శింగనమలలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

రేపు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పామిడి: పట్టణంలోని 18, 20 వార్డుల్లో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు కోరాయి.

వీధికుక్కల సంతాన నియంత్రణపై స్పెషల్ డ్రైవ్

గుంతకల్లుటౌన్: పట్టణంలో వీధి కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్లపై స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శనివారం బ్లూక్రాస్ సంస్థ వారు పట్టణంలోని పలు ఏరియాల్లో కుక్కలను పట్టించారు. చిన్నపిల్లలను బయటకు ఒంటరిగా పంపొద్దని, వీధుల్లో కుక్కలు ఎక్కువగా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

2న ఆలూరు హుండీకానుకల లెక్కింపు

తాడిపత్రి అర్బన్: ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయ హుండీకానుకలను వచ్చే నెల 2న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎంవి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన దలచిన భక్తులు పంచె, కండువా ధరించి రావాలని సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని కడప రోడ్డు, యల్లనూరు రోడ్డు, నంద్యాల రోడ్డు ప్రాంతాల్లో ఆదివారంవిద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వీరాంజినేయులు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని, ప్రజలు గమనించాలని కోరారు.

మణిపూర్ ఉదంతంపై నిరసన

యాడికి: మణిపూర్ ఘటనకు కేంద్రమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు మండల కేంద్రంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి ఒకరిపై సామూహిక అత్యాచారం చేయడం దేశ ప్రజలను తీవ్రదిగ్భ్రాంత్రికి గురి చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ఇలాంటి అమానవీయ సంఘటన చోటుకుందని, కళ్ల ముందే అఘాయిత్యాలు జరుగుతున్న అక్కడి పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సిగ్గుచేటన్నారు. నాయకులు వెంకటరాముడు యాదవ్, శ్రీనివాసులు, ఓబిరెడ్డి, శ్రీరాములు, రాముడు, రాఘవ, బాలన్న శివన్న జనార్ధన పాల్గొన్నారు.

'ప్రాణమున్నంత వరకూ వైఎస్సార్‌సీపీలోనే'

పామిడి: ప్రాణమున్నంత వరకూ వైఎస్సార్‌సీపీ కోసమే పనిచేస్తానని ఆ పార్టీ మండల నేత జోజోడే కుమార్ అన్నారు. శనివారం పామిడిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభ్యున్నతిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నానన్నారు. ఎమ్మెల్యే వైవీఆర్ నేతృత్వంలో మండల అభివృద్ధి పనులు, పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నానన్నారు. స్థానిక సరస్వతీ విద్యామందిరం సమితి అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ స్కూల్ అభ్యున్నతికి కృషి చేస్తున్నానన్నారు. తన ఎదుగుదలను ఓర్వలేక కొందరు తాను ఆర్ఎస్ఎస్ ఉంటూ బీజేపీలో కొనసాగుతున్నానని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

తాడిపత్రి అర్బన్: మూతపడిన నాపరాతి పరిశ్రమలో చోరీకి పాల్పడిన ముగ్గురు గుజిరి వ్యాపారులను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ మహ్మద్‌గౌస్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. సజ్జలదిన్నె గ్రామ సమీపంలో నాపరాతి పరిశ్రమ మూతపడింది. అయితే అందులోని యంత్రాలు, మోటర్లు అలాగే ఉన్నాయి. విషయాన్ని గమనించిన రహంతుల్లా, కొలిమి బాషా, కతాలప్ప అనే ముగ్గురు గుజిరి వ్యాపారులు వాటిని చోరీ చేసి ఆటోలో తరలిస్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.